ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

అమరజీవి స్మారక భవనానికి పూర్వవైభవం

● ఏపీ మారిటైమ్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యనారాయణ హామీ

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు ఆత్మత్యాగం చేసిన స్మారకస్థలంగా గుర్తింపు పొందిన అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనం మరమ్మతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులతో, మంత్రులతో చర్చించి తగిన నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటానని ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యనారాయణ (సత్య) హామీ ఇచ్చారు. మైలాపూరులో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో ఆదివారం ఉదయం జరిగిన పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో అట్టహాసంగా ఈ వేడుకలు జరిగాయి. ఆ సందర్భంగా 'గురువులకు సత్కారం' పేరిట ఆచార్యులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆ సందర్భంగా జరిగిన సభకు భవన నిర్వాహక కమిటీ అధ్యక్షులు కాకుటూరు అనిల్‌కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. నిడమర్తి వసుంధరాదేవి ప్రార్థనతో ప్రారంభమైన ఈ సభలో కమిటీ కార్యదర్శి, కోశాధికారి వి.కృష్ణారావు స్వాగతోపన్యాసం చేస్తూ ఈ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా దామచర్ల సత్యనారాయణ రావడం సముచితంగా ఉందని, ఆంధ్రరాష్ట్రమంతటా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు జరుగుతున్న వేళ తమిళనాట ఆ వేడుకల్లో గురువులను సత్కరించడం అపూర్వమైన సంఘటన అని కొనియాడారు. కమిటీ అధ్యక్షులు కాకుటూరు అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ముఖ్య అతిథిగా విచ్చేసిన దామచర్ల సత్యనారాయణ తండ్రి పూర్ణచంద్రరావు, తాను ఒకే కళాశాలలో చదువుకున్నామని, తండ్రిలాగే సత్యనారాయణ కూడా ప్రజలకు సేవలందించటంలో అందరికన్నా ముందుంటారని ప్రశంసించారు. ఈ భవనంలో ఎన్నో కార్యక్రమాలు చేసినా తగినంత జనం రాక కుర్చీలు ఖాళీగా ఉండేవని, తొలిసారిగా హాలు నిండి, హాజరైన సభ్యులకు కుర్చీలు కొరత ఏర్పడిన పరిస్థితిని తానిప్పుడే చూస్తున్నానన్నారు. ఈ వేడుకల్లో హోసూరు, తిరువళ్లూరు, తదితర ప్రాంతాల తెలుగు ఆత్మీయులంతా రావడం పొట్టి శ్రీరాములుపై వారికున్న అభిమానాన్ని చాటుతోందన్నారు. భవన నిర్వాహక కమిటీ నిధులేమితో సతమవుతోందని, గత నాలుగేళ్లలో ఒక్కసారి మాత్రమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, ఆ పరిస్థితుల్లో ఐదారు లక్షల మేరకు తామంతా సొంతడబ్బు ఖర్చుపెట్టి ఈ విశిష్ట భవనాన్ని సంరక్షిస్తున్నామని చెప్పారు.



సత్యనారాయణను సత్కరిస్తున్న భవన నిర్వాహక కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు

నిధులు తెప్పిస్తా...!

ముఖ్య అతిథి దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ చెన్నైలో పొట్టి శ్రీరాములు ఆత్మత్యాగం చేసిన పుణ్యస్థలంలో ఆయన 124వ జయంతి వేడుకల్లో పాల్గొనటం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. పొట్టి శ్రీరాములు, తాను ప్రకాశం జిల్లా కనిగిరికి చెందినవారంగా ఉండటం కాకతాళీయమేనని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పూర్వవైభవం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ తీవ్రంగా పాటుపడుతున్నారన్నారు. ఇక అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనానికి పూర్వ వైభవం కలిగేలా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులతో సంప్రదించి జరిపి మరమ్మతు చేయిస్తానని సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. వీలయితే సీఎస్ఆర్ ఫండ్ రూపంలోనైనా సాయం అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.



సత్కార గ్రహీతలైన గురువులతో ముఖ్య అతిథి, భవన నిర్వాహక కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు

ఆత్మే తొలిగురువు...

ప్రముఖ సినీ రచయిత, కమిటీ సభ్యులు భువన చంద్ర 'గురువులకు అభినందనలు' పేరిట ప్రసంగిస్తూ మానవులందరికీ తొలి గురువు ఆత్మేనని, సత్ప్రవర్తన నేర్పేవారే గురువులని, శిష్యులు ఎంత ఎత్తుకు ఎదిగినా ఆనందించే గుణం గురువులకే ఉంటుందన్నారు. కమిటీ సంయుక్త కార్యదర్శి పూరా శశికళ సభానిర్వహణ బాధ్యత నిర్వర్తించారు. కమిటీ సభ్యులు డా. ఎంవీ నారాయణగుప్తా వందన సమర్పణ చేశారు. కమిటీ సభ్యులు గుడిమెట్ల చెన్నయ్య, ఏవీ శివకుమారి, జేఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గురువులకు సత్కారం పేరిట ఆచార్య ఎల్వీ శంకరరావు, ఆచార్య విస్తాలి శంకరరావు, విశ్రాంత అధ్యాపకులు, అధ్యాపకులు ఏవీ శివకుమారి, ఎ. అంబ్రుణి, ఎలిజబెత్ జయకుమార్, ఏ విజయలక్ష్మి సి. సంపత్, ఎం.మునిరత్నం, మందలపు నటరాజ్, ఎం.యతిరాజులు, మామిడి మురళి, మోహనకుమారి, పాండురంగం కాళియప్ప, మాదా శంకరబాబు, జి.దయామణి, జి.నళిని, ఎస్.స్వరూప, ఎ.ధనలక్ష్మి, ఏ మునిరత్నం, ఎం.షణ్ముగం, పీఎస్ మైథిలి తదితరులను ముఖ్యఅతిథి, కమిటీ సభ్యులు సంయుక్తంగా సత్కరించారు. తొలుత భవనంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. అదే సమయంలో కమిటీ సభ్యుడు జేఎం నాయుడు జన్మదినం సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్‌చేయించారు.

ప్రముఖ సినీ గేయరచయిత వైరముత్తు రచనలపై చెన్నైలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో 'వైరముత్తియం' అనే పరిశోధన గ్రంథాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని డీఎంకే ఎంపీ జగద్రక్షగన్‌కు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



కరాటే మాస్టర్‌కు రూ.5లక్షల ప్రభుత్వ సాయం

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కరాటే మాస్టర్, విలువిద్యానిపుణుడు, తమిళ సినీ నటుడు సిహాన్ హుసైనీ చికిత్స కోసం రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ తరపున రూ.5లక్షల సహాయాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రకటించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హుసైనీకి క్రీడా శాఖ అధికారులు రూ.5లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా హుసైనీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి ధన్యవాదాలు తెలుపుకున్నారు. ప్రఖ్యాత దర్శకుడు కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'పున్నగైమన్నన్' చిత్రం ద్వారా కరాటే మాస్టర్ హుసైనీ విలన్‌గా పరిచయమయ్యారు. ఆ తర్వాత నటుడు విజయ్‌తోను నటించారు. ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు హుసైనీ కరాటే కూడా నేర్పారు. ఈ నేపథ్యంలో హుసైనీ యూట్యూబ్‌లో పెట్టిన సందేశం, ఆపై రాసిన లేఖకు ఉదయనిధి స్పందించి ఈ ఆర్థికసాయం అందించారు.



ప్రభుత్వం అందించిన రూ.5లక్షల చెక్కు చూపుతున్న సిహాన్ హుసైనీ

డీఎంకే ప్రభుత్వ అవినీతి రాస్తే పెద్ద గ్రంథమే

● టీవీకే అధినేత విజయ్ ధ్వజం



అడయార్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వ అవినీతి గురించి ఎంత రాసినా తక్కువే అవుతుందని, కొన్ని దశాబ్దాలుగా సాగుతున్న ఆ పార్టీ అవినీతి అక్రమాలను వివరిస్తూ పోతే ఓ మహాగ్రంథమే తయారవుతుందని తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత, సినీ నటుడు విజయ్ పేర్కొన్నారు. టాస్మాక్ దుకాణాల్లో జరిగిన అవినీతిపై సుదీర్ఘ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా టాస్మాక్ మద్యం కార్యాలయాలు, టాస్మాక్ మద్యం వ్యాపారంతో సంబంధం ఉన్న పలువురి ఇళ్లు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు తనిఖీ చూసి నివేదిక వెల్లడించారన్నారు. డిస్టిలరీస్, బాటిలింగ్ కంపెనీల్లో జరిగే అక్రమాలు తదితర అంశాలను ఈడీ అధికారులు ప్రధానంగా ప్రస్తావించారని తెలిపారు. ఈ సోదాల్లో లెక్కల్లో చూపని నగదు వివరాలను గుర్తించినట్టు పేర్కొన్నారు. వీటిన్నింటినీ పరిశీలిస్తే, ఈ అవినీతి అక్రమాల్లో బాగా అనుభవం కలిగిన వారి హస్తం ఉన్నట్టుగా తెలుస్తుందన్నారు. ఈడీ అధికారులు విడుదల చేసిన ప్రకటనను పరిశీలిస్తే, ఉత్తుత్తి ప్రచారాన్ని గొప్పగా చేసుకునే డీఎంకే ప్రభుత్వంపై ఒక అవినీతి సాహిత్యాన్నే రచించవచ్చని వెల్లడించారు. మద్యంలోనే డీఎంకే ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించాచు. టాస్మాక్ అవినీతిలో హస్తం ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుని, వాస్తవాలను బహిర్గతం చేయాలని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



అసోం రాజధాని గౌహతిలో ఆ రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను ఆదివారం ఉదయం మర్యాదపూర్వకంగా కలుసుకున్న గవర్నర్ ఆర్ఎన్ రవి



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవానీ సుబ్బరాయన్

అంత్యక్రియలకు వెళ్తూ అనంతలోకాలకు..

● బైకును ఢీకొన్న బస్సు ● కుమార్తె సహా దంపతుల మృతి

అడయార్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తమ బంధువుల ఇంటిలో జరిగే అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తూ దంపతులు, వారి కుమార్తె రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ విషాదకర ఘటన విల్లుపురం జిల్లా సెంజీ సమీపంలో జరిగింది. దీనికి సం బంధించి వివరాలిలా... విల్లుపురం జిల్లా సెంజి సమీపంలోని రాజాం పులియూర్ అనే గ్రామానికి చెందిన దురైకన్ను (46) తన కుటుంబ సభ్యులతో కలిసి మధురవాయల్ ప్రాంతంలో నివశిస్తున్నారు. ఆయనకు భార్య పచ్చయమ్మాళ్ (42), కుమార్తె గోపిక (18), కుమారుడు అశోక్ కుమార్ ఉన్నారు. నెల రోజు క్రితం దురైకన్ను సోదరుడు నందగోపాల్ (55) ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శనివారం రాత్రి మృతి చెందాడు. ఆ విషయం తెలుసుకున్న దురైకన్ను సోదరుడు అంత్యక్రియల కోసం తన ద్విచక్రవాహనంపై భార్య, కుమార్తెతో, మరో బైకులో కుమారుడు అశోక్ కుమార్ శనివారం రాత్రి సెంజికి బయలుదేరారు. వీరు సెంజి - దిండివనం రహదారిలో వెళ్తుండగా ఎదురుగా చెన్నై వస్తున్న ప్రభుత్వ రవాణా సంస్థ బస్సు బైకును ఢీకొంది. ఈ ఘటనలో దురైకన్ను, ఆయన భార్య, కుమార్తె తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మరణించారు. ఈసమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతులు దురైకన్ను, పచ్చయమ్మాళ్, గోపిక (ఫైల్‌ఫొటోలు)

సీనియర్ నటి బిందు ఘోష్ మృతి

అడయార్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కోలీవుడ్ సీనియర్ నటి బిందు ఘోష్ (76) ఆదివారం మధ్యాహ్నం కన్నుమూశారు. వయోభారంతో పాటు గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆదివారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని విరుగంబాక్కంలోని స్వగృహానికి తరలించి, అభిమానుల సందర్శనార్థం ఉంచారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఆమె కుమారులు వెల్లడించారు. కాగా 1980 దశకంలో హాస్య నటిగా ఓ వెలుగు వెలిగిన బిందు ఘోష్.. అగ్రనటులు రజనీకాంత్, కమల్ హాసన్, సత్యరాజ్, ప్రభు తదితరుల చిత్రాల్లో నటించారు. తమిళం సహా పలు భాషల్లో వందకు పైగా చిత్రాల్లో నటించారు. ఆమె మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు.



బిందు ఘోష్ (ఫైల్‌ఫొటో)

సెంగోటయ్యాన్ వ్యవహారం... త్వరలో ఉద్వాసన తప్పదా ?

అన్నాడీఎంకేలో పెరుగుతున్న వ్యతిరేకత

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేలో గత రెండు నెలగా పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటూ, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కి ముఖం చాటేస్తున్న సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి సెంగోటయ్యన్‌పై పార్టీలోని మెజారిటీ సభ్యులు తీవ్ర వ్యతిరేకత ప్రకటిస్తున్నారు. పార్టీ వ్యవహారాలను బహిరంగంగా ప్రకటిస్తున్న సెంగోటయ్యన్‌ను పార్టీ నుండి తొలగించాలని ఈపీఎస్‌పై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ద్వంద్వ నాయకత్వం వల్ల పార్టీ ప్రతిష్ఠ దిగజారుతుండటంతో అప్రమత్తమైన ఈపీఎస్ మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, ఆయన మద్దతుదారులకు ఉద్వాసన పలికారు. 2023 మార్చి 28న పార్టీ ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పార్టీని అభివృద్ధి పరచడంలోనే తలమునకలవుతున్నారు. పార్టీ బలహీనంగా ఉన్న జిల్లాల్లో కొత్త కార్యదర్శులను నియమించారు. అదే సమయంలో జిల్లా కార్యదర్శులుగా ఉన్న పాతకాపుల పనితీరుపై నిఘాను పెంచారు. వీరి పనితీరును పరిశీలించేందుకు పార్టీ పరంగా కొన్ని కమిటీలను కూడా రంగంలో దింపారు. తనకు చెప్పకుండా, తన మద్దతుదారులకు ఆ కమిటీలలో స్థానం కల్పించకుండా ఈపీఎస్ వ్యవహరించిన తీరుపై తొలిసారిగా ఆ పార్టీ నేత సెంగోటయ్యన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి నుండే ఈపీఎస్ ఆయనను పార్టీ వ్యవహారాలకు దూరం పెట్టారు. ఆ తర్వాత గత ఫిబ్రవరిలో కోయంబత్తూరులో ఎడప్పాడి పళనిస్వామికి రైతు సంఘాలు జరిపిన సత్కార సభలో సెంగోటయ్యన్ గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజులకు ముందు సెంగోటయ్యన్ అధ్యక్షతన జరిగిన పార్టీ స్థానిక నేతల సమావేశంలో ఆయన కళ్లెదుటే రెండు వర్గాల నేతలు దాడులకు దిగారు. ఈ సంఘటనకు పార్టీ అధిష్ఠానవర్గమే కారణమని సెంగోటయ్యన్ అనుమానిస్తున్నారు.

క్లిష్టపరిస్థితుల్లో ఉన్నా: సెంగోటయ్యన్

తానిప్పుడు క్లిష్టపరిస్థితుల్లో ఉన్నాననీ ఏది మాట్లాడినా వివాదాస్పదమవుతోందని, నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్‌లా తాను ఏ విషయాన్నయినా కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడలేకున్నానని సెంగోటయ్యన్ అన్నారు. ఆదివారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన క్లిష్టపరిస్థితిలోనే తాను పార్టీ శ్రేణుల వద్ద మాట్లాడుతున్నానని, కాల పరిస్థితుల వల్ల టీవీల్లో రోజూ ఎన్నో వార్తలు వస్తున్నాయని, తానిప్పుడు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నానో అందరికీ తెలుసునని నిర్వేదంగా మాట్లాడారు. స్పీకర్ అప్పావుపై అవిశ్వాసతీర్మా నం ప్రవేశపెట్టబోతున్న సమయంలో ఆయనను ఎలా కలుసుకుంటారని పార్టీ నేతలు తనను ప్రశ్నిస్తున్నారని, వాస్తవానికి తానొక్కడే స్పీకర్‌ను కలవలేదని, ఆరుగురు ఎమ్మెల్యేలు కలుసుకున్నారని చెప్పారు. తన నియోజకవర్గానికి సంబంధించిన సమస్యను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లాలంటే సావధాన తీర్మానం ప్రవేశపెట్టాలని, అందుకు స్పీకర్ అనుమతి కావాలని సెంగోటయ్యన్ వివరించారు. వాస్తవాలు ఇలా ఉండగా స్పీకర్‌ను తాను కలుసుకోవడంపై పెద్ద రాద్ధాంతం సృష్టించారన్నారు.



అసెంబ్లీలో...

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోనూ సెంగోటయ్యన్ వింత వైఖరి అవలంభించారు. ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు బడ్జెట్ ప్రవేశపెడుతుండగా టాస్మాక్ సంస్థపై జరిగిన ఈడీ దాడులపై చర్చ జరగాలంటూ ఈపీఎస్ సహా పార్టీ సభ్యులందరూ మూకుమ్మడిగా లేచి స్పీకర్ అప్పావుతో గొడవ పెట్టుకోగా, అదే సమయంలో కుర్చీలోనే కూర్చుకుని సెంగోట్టయన్ తన ముందున్న ట్యాబ్‌లో బడ్జెట్ అంశాలను పరిశీలించసాగారు. ఇది ఈపీఎస్‌కు ఆగ్రహం తెప్పించిందని చెబుతున్నారు. మరుసటి రోజు సెంగోటయ్యన్ స్పీకర్ అప్పావును కలుసుకోవడం కూడా వివాదాస్పదంగా మారింది. ఈ విషయమై మీడియా ఈపీఎస్‌ను ప్రశ్నించగా, స్పీకర్‌ను ఎందుకు కలుసుకున్నారో అతడినే అడగాలంటూ మండిపడ్డారు. ఇలా రోజురోజూకూ ఈపీఎస్, సెంగోటయ్యన్ మధ్య విబేధాలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. అదే సమయంలో పార్టీలోనూ సెంగోటయ్యన్‌పై తీవ్ర వ్యతిరేకత బయలుదేరింది. పార్టీ పరంగా ఏవైనా ప్రధాన సమస్యలుంటే సెంగోటయ్యన్ నేరుగా ఈపీఎస్‌ని కలిసి చర్చిస్తే సమస్యలన్నీ పటాపంచలవుతాయని కూడా చెబుతున్నారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాను పాలకపక్షంగా ఘాటుగా విమర్శించలేదని, అలా విమర్శించడానికంటూ పార్టీలో ఇద్దరు నాయకులు ఉన్నారు కదా, ఆ నాయకులెవరో మీరు తెలుసునని ఆయన తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించారు. సెంగోటయ్యన్ ఇలా నిర్వేదంగా మాట్లాడిన తీరును బట్టి పార్టీలో ఆయన తీరుపై తీవ్రంగా వ్యతిరేకత బయలుదేరిందని స్పష్టమవుతోంది. ఈ పరిస్థితులలో ఆయనను పార్టీ నుండి కూడా త్వరలోనే తొలగిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (సోమవారం సాయంత్రం)
సహర్: 4:35 (మంగళవారం ఉదయం)

సమాచార దర్శిని

పాలిటెక్నిక్ విద్యార్థులకు అరియర్స్ రాసేందుకు అవకాశం

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాల్లో చదివి దీర్ఘకాలంగా అరియర్స్ ఉంచిన పూర్వ విద్యార్థులు మళ్లీ పరీక్షలు రాసేందుకు అనుతించారు. ఈ విషయమై ఉన్నత విద్యాశాఖ శనివారం విడుదల చేసిన ప్రకటనలో... పాలిటెక్నిక్ కళాశాలల్లో చివరి సంవత్సరం పరీక్షలు రాసి, ఉతీర్ణత కాని పాఠ్యాంశాలు (అరియర్స్) ఉన్న విద్యార్థులు ఏప్రిల్, అక్టోబరులో నిర్వహించే సెమిస్టర్ పరీక్షల్లో, అరియర్ పరీక్షలు రాసే అవకాశం కల్పించామని తెలిపింది. అరియర్ పరీక్షలకు సంబంధించిన మరిన్ని వివరాలను https://dte.tn.gov.in అనే వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ఉన్నత విద్యాశాఖ తెలియజేసింది.

అసిస్టెంట్ కుక్ పోస్టుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీలో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 8,997 అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీకి సంబంధించి శనివారం విడుదల చేసిన నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. ఆ ప్రకారం, ఏడాది వేతనం అనంతరం ప్రత్యేక కాలానుగుణంగా వేతనం, దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పిస్తూ జీవోలో మార్పులు చేశారు. ఈ ప్రకారం, 8,997 పోస్టుల భర్తీతో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ కల్పించింది.

ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా మెట్రో సేవల పొడిగింపు

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరిగే రోజుల్లో అర్ధరాత్రి ఒంటి గంటల వరకు మెట్రోరైళ్లు నడుపనున్నట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. చేపాక్కంలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగే ఐపీఎల్ పోటీలకు వెళ్లే అభిమానుల సౌకర్యార్థం సీఎంఆర్ఎల్-చెన్నై సూపర్ కింగ్స్ మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఆ ప్రకారం, చెన్నై సూపర్ కింగ్స్ ఆడే మ్యాచ్ రోజుల్లో మెట్రో రైలు సేవలు అర్ధరాత్రి ఒంటి గంట వరకు అందుబాటులో ఉంటాయి. అలాగే, స్పానర్లు అందజేసే ఐపీఎల్ టిక్కెట్లున్న వారు అన్ని మెట్రో రైల్వేస్టేషన్ నుంచి గవర్నమెంట్ ఎస్టేట్ మెట్రో రైల్వేస్టేషన్ వరకు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని సీఎంఆర్ఎల్ తెలిపింది.

సహకార సంఘాల్లో రూ.17 వేల కోట్ల పంట రుణం

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంటల సాగుకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో సహకార సంఘాలకు రూ.17,000 కోట్ల పంట రుణాలు అందజేయనున్నారు. అలాగే, పశుపోషణ, చేపలు, తేనెటీగల పెంపకం సహా వ్యవసాయ సంబంధిత కార్యాకలాపాల కోసం రైతుల స్వల్పకాలిక రుణ అవసరాలకు తీర్చేలా రాబోయే ఆర్థిక సంవత్సరంలో రూ.3,000 కోట్ల మూలధన రుణం అందించనున్నారు. 2021-22 నుండి ఈ నెల 11వ తేదీ వరకు 67.81 లక్షల మంది రైతులకు రూ.54,800 కోట్ల పంట రుణాలు, 12.24 లక్షల మందికి రరూ.6,558 కోట్ల రుణాలు అందించనున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రాయితీకి రూ.853 కోట్లు ప్రభుత్వం అందించిందని సహకార శాఖ అధికారులు తెలిపారు.

20 నుంచి ఏప్రిల్ 13 వరకు తిరునల్వేలి - తిరుచెందూరు రైళ్ల రద్దు

టి.నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి నుంచి తిరుచెందూరుకు రోజూ నడిచే ప్యాసింజర్ రైలు సర్వీసులను ఈ నెల 20 నుంచి రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే మదురై సర్కిల్ అధికారులు ప్రకటించారు. తిరునల్వేలిలో రెండో రైలు మార్గానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టనుండడంతో ఈ రైళ్లను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరునల్వేలి నుంచి తిరుచెందూరుకు సాయంత్రం 4.30 గంటలకు నడిపే ప్యాసింజర్ రైలు, అదే విధంగా తిరుచెందూరు నుండి తిరునల్వేలికి ఉదయం 10.10 గంటలకు నడిపే ప్యాసింజర్ రైలును ఈ నెల 20 నుండి ఏప్రిల్ 13 వరకు రద్దు చేస్తున్న తెలిపారు.

గుమ్మిడిపూండి మార్గంలో 21 రైళ్ల రద్దు..

చెన్నై సెంట్రల్ - గూడూరు మార్గంలో ఈ నెల 17న మరమ్మతులు చేపట్టనుండటంతో చెన్నై మూర్‌మార్కెట్ - గుమ్మిడిపూండి మార్గంలో నడిచే 21 లోకల్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నెల 17 ఉదయం 9.25 నుండి మధ్యాహ్నం 2.25 వరకు ఈ మరమ్మత్తు పనులు జరుగుతాయని తెలిపారు.

నేడు గూడూరు వరకే పినాకిని

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రైలు పట్టాలు, సిగ్నలింగ్ వ్యవస్థల మరమ్మతుల కారణంగా సోమవారం విజయవాడ-చెన్నై సెంట్రల్ (నెం.12711) పినాకిని ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్‌కు బదులు గూడూరు వరకే నడుపనున్నారు. అలాగే, డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-విజయవాడ (నెం.12712) పినాకిని ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్‌కు బదులు సాయంత్రం 4.15 గంటలకు గూడూరు నుంచి బయల్దేరుతుందని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

అమరజీవికి ఏఐటీఎఫ్ ఘన నివాళి

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆత్మత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకల సందర్భంగా అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) ఆధ్వర్యంలో రాయపేట లజ్ ప్రాంతంలో ఉన్న శ్రీరాములు స్మారక భవనంలోని ఆయన విగ్రహానికి సమాఖ్య నిర్వాహకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్ నందగోపాల్, ఉపాధ్యక్షులు గొల్లపల్లి ఇజ్రాయేల్, సమాఖ్య సభ్యులు ఎన్. నాగభూషణం, పాలకొండయ్య, గజేంద్రబాబు, రోశయ్య, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏఐటీఎఫ్ అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి, సభ్యులు

క్యూలైన్‌లో భక్తుడి మృతి

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తుడు హఠాత్తుగా స్పృహ తప్పి మృతిచెందాడు. ఆదివారం సెలవ కావడంతో ఈ ఆలయానికి పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చారు. ఈ నేపథ్యంలో, కారైక్కుడి ప్రాంతానికి చెందిన జౌళి వ్యాపారి ఓంకుమార్ క్యూలైన్‌లో ఉన్న సమయంలో హఠాత్తుగా స్పృహతప్పి కిందపడిపోయాడు. ఆలయ సిబ్బంది వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.

కారు చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధురవాయల్‌లో కారు చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువళ్లూర్ జిల్లా కపిలన్ నగర్ సన్నిధి వీధికి చెందిన సతీష్ కుమార్ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం తన కారులో మధురవాయల్ మార్కెట్‌కు వెళ్లి సరుకులు తీసుకొని తిరిగి వస్తూ, మధురవాయల్ ఏరిక్కరై ప్రాంతంలో కారును రోడ్డు పక్కన ఉంచి టీ తాగేందుకు వెళ్లాడు. టీ తాగి వచ్చి చూడగా కారు లేకపోవడంతో మధురవాయల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీ ఆధారంగా మదురై జిల్లా ఒత్తికడై ప్రాంతానికి చెందిన అళగర్ అలియాస్ అళగర్‌స్వామిని అరెస్ట్ చేసి కారు స్వాధీనం చేసుకున్నారు. అళగర్‌పై ఇదివరకే తూత్తుకుడి, మదురై జిల్లాల్లో మూడు చోరీ కేసులున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. అరెస్ట్ చేసిన అళగర్‌ను శనివారం కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు నగర పోలీసు శాఖ ఆదివారం ప్రకటన విడుదల చేసింది.

డెంగ్యూ జ్వరంతో బాలిక మృతి

వేలూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కేవీకుప్పం సమీపంలో డెంగ్యూ జ్వరంతో బాలిక మృతిచెందింది. మేల్‌విలాచూర్ గ్రామానికి చెందిన గోవిందరాజ్ 13 ఏళ్ల కుమార్తె 9వ తరగతి చదువుతోంది. కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమెను ఈ నెల 7వ తేదీ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, వైద్యులు పరీక్షించి డెంగ్యూ జ్వరమని నిర్ధారణ అయింది. ఈ క్రమంలో, మూత్రపిండాలు, శ్వాసకోశాలు పనిచేయకపోవడంతో ఆదివారం ఉదయం బాలిక మృతిచెందింది. సమాచారం అందుకున్న ఆరోగ్య సిబ్బంది గ్రామానికి చేరుకుని, వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయడంతో పాటు ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

19న ఆటో డ్రైవర్ల సమ్మె

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆటో మీటరు ఛార్జీల పెంపు, కాల్ టాక్సీ యాప్‌లు నియంత్రించాలి తదితర డిమాండ్లతో ఈ నెల 19న సమ్మె చేపట్టనున్నట్లు తమిళనాడు ఆటో డ్రైవర్ల సంఘం ప్రకటించింది. ఈ మేరకు మెడ్రాస్-చెంగల్పట్టు ఆటో డ్రైవర్ల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రన్ విడుదల చేసిన ప్రకటనలో... ఆటో మీటరు ఛార్జీల పెంపు వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ, 1.5 కి.మీ రూ.50, ఆపైన కి.మీ రూ.25గా సిఫారసు చేసిందన్నారు. కానీ, కొన్ని సంస్థలు చట్టవిరుద్ధంగా 1.8 కి.మీ మీటరు రూ.76 వసూలుచేస్తున్నారని, ఈ కారణంగా ప్రజలు వాటినే వినియోగిస్తుండడంతో తాము ఉపాధి కోల్పోతున్నామన్నారు. ఈ క్రమంలో ఆటో మీటర్ల ఛార్జీల పెంపు, కాల్ టాక్సీ యాప్‌ల నియంత్రణ తదితర కోర్కెల సాధనకు ఈనెల 19న సమ్మె చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

జల్లికట్టు ఎద్దు దాడిలో గాయపడిన యువకుడి మృతి



మృతుడు మహేష్ పాండ్యన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జల్లికట్టు ఎద్దు దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జన్మదినం సందర్భంగా మదురై జిల్లా అలంగానల్లూర్ సమీపం కీలక్కరై సెంటినరీ మైదానంలో ఆదివారం జల్లికట్టు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మంత్రి మూర్తి, చోళవందాన్ ఎమ్మెల్యే వెంకటేశన్ జెండా ఊపి ప్రారంభించారు. పోటీల్లో వెయ్యికి పైగా ఎద్దులు, 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న చోళవందాన్ ప్రాంతానికి చెందిన మహేష్ పాండ్యన్ (22) ఎద్దును అదుపుచేసే సమయంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక మృతిచెందాడు. ఎం.కామ్ పూర్తిచేసిన మహేష్ పాండ్యన్ చైనాలో ఉద్యోగం చేస్తున్నట్లు, పొంగల్ సెలవుల కోసం స్వగ్రామానికి వచ్చాడని బంధువులు వాపోయారు.

నేటినుంచి పోలీస్ షూటింగ్ పోటీలు

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత పోలీసు షూటింగ్ పోటీలు సోమవారం చెంగల్పట్టు జిల్లా ఒట్టియంబాక్కంలో ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో 30 రాష్ట్రాలకు చెందిన 634 మంది పోలీసులు పాల్గొననున్నారు. గడిచిన 24 ఏళ్లుగా జాతీయస్థాయిలో అన్ని రాష్ట్రాల పోలీసుల మధ్య మహిళలు, పురుషుల విభాగాల్లో షూటింగ్ పోటీలు నిర్వహిస్తుండగా, కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారుల వరకు పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది పోటీలకు రాష్ట్ర పోలీసు శాఖ అతిథ్యం ఇస్తోంది. ఒట్టియంబాక్కంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పోటీలు 23వ తేది వరకు కొనసాగనున్నాయి. ఈ విషయమై రాష్ట్ర పోలీసు శాఖ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ... ఈ పోటీల్లో 30 రాష్ట్రాలకు చెందిన 550 మంది పురుషులు, 84 మంది మహిళలు పాల్గొనున్నారని, పోటీలు తిలకించేందుకు ప్రజలకు అనుమతి లేదన్నారు. చివరి రోజు ఎగ్మూర్ రాజారత్నం స్టేడియంలో జరిగే వేడుకల్లో సీఎం ఎంకే స్టాలిన్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేస్తారని ఆయన తెలిపారు.

ప్రత్యక్ష నియామకం ద్వారా అంగన్వాడీ పోస్టుల భర్తీ

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష నియామకాల ద్వారా 7,783 అంగన్వాడీ పోస్టులు భర్తీచేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో... సాంఘిక సంక్షేమం, మహిళా సాధికారిత సమగ్ర పిల్లల సంరక్షణ సేవల్లో అంగన్వాడీ వర్కర్, మినీ అంగన్వాడీ వర్కర్ తదితర 7,783 పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీచేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

23న జిల్లా కేంద్రాల్లో జాక్టో- జియో నిరాహార దీక్ష

టి.నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభలో ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధ్యాయులు, ప్రభుత్వోద్యోగుల చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను నెరవేర్చే ప్రకటన లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్త ఆందోళన ప్రారంభించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ఉమ్మడి కార్యాచరణ మండలి (జాక్టో-జియో) నిర్ణయించింది. పాత పింఛను విధానం అమలు సహా కీలకమైన డిమాండ్లను ఆమోదించాలని కోరుతూ జాక్టో-జియో గత కొంతకాలంగా ఉద్యమాలు చేస్తోంది. ఇటీవల కూడా నగరంలో సచివాలయ ముట్టడి తదితర ఆందోళనలు చేపట్టింది. సచివాలయంలో ఉన్నత అధికారుల స్థాయిలో ద్వైపాక్షిక సమావేశాలు కూడా జరిగినా జాక్టో-జియో కోరికలను నెరవేర్చేదిశగా ప్రభుత్వ పరంగా ఎలాంటి హామీ ప్రకటించలేదు. దీంతో వార్షిక బడ్జెట్‌లోనైనా తమ డిమాండ్లను ఆమోదిస్తూ ప్రభుత్వం ప్రకటన చేస్తుందని జాక్టో-జియో నాయకులు ఎదురు చూశారు. చివరకు బడ్జెట్‌లోనూ వారికి నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ట్రిప్లికేన్‌లోని ఎన్జీవో కార్యాలయ భవనంలో జాక్టో-జియో నాయకుల సమావేశం జరిగింది. ఆ సంఘం సమన్వయకర్తలు మాయవన్, శేఖర్, పార్థసారథి, రాష్ట్ర స్థాయి నాయకులు గాంధీ రాజ్, దాస్, త్యాగరాజన్, విన్సెంట్ పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఆ మేరకు బడ్జెట్‌లో ఉపాధ్యాయులకు, ప్రభుత్వ ఉద్యోగుల చిరకాల డిమాండ్ల ప్రస్తావనే లేకపోవడంతో ప్రభుత్వం తమపై ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఖండిస్తూ ఈ నెల 23 జిల్లా కేంద్రాలలో నిరాహార దీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆ తర్వాత కూడా ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే ఈ నెల 30 సమావేశమై తదుపరి ఆందోళనలపై తగు నిర్ణయం తీసుకుంటామని జాక్టో-జియో రాష్ట్ర సమన్వయకర్త గాంధీరాజ్ తెలిపారు.

ప్రముఖ తమిళ రచయిత నారుంపూ నాథన్ ఆకస్మిక మృతి



చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ రచయిత నారంపూ నాథన్ (64) ఆదివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. తూత్తుకుడి జిల్లా కళగుమలై గ్రామంలో జన్మించిన నారుంపూ నాథన్ బ్యాంక్‌లో పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయన సతీమణి శివకామ సుందరి ప్రధానోపాధ్యాయురాలిగా పని చేసి రిటైర్ అయ్యారు. వీరి కుమారుడు దీపక్ ప్రస్తుత విదేశాల్లో నివసిస్తున్నారు. తిరునల్వేలి శాంతినగర్‌లో ఉంటున్న నారుంపూ నాథన్ రాష్ట్ర అభ్యుదయ రచయతలు కళాకారుల సంఘం సభ్యుడిగా ఉన్నారు. దక్షిణాది జిల్లాలోని సాహిత్య తమిళ భాషాభివృద్ధి కోసం తీవ్రంగా కృషి చేశారు. వందకు పైగా తమిళ సాహిత్య గ్రంథాలను రచించారు. 2022లో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఉ.వే.సామినాథర్ అయ్యార్ స్మారక అవార్డుతో సత్కరించింది. ఆదివారం వేకువజాము వాకింగ్‌కు వెళతుండగా కుప్పకూలిపడ్డారు. వెంటనే కుటుంబీకులు ఆయనను తిరునల్వేలి వన్నారపేటలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత నారుంపూ నాథన్ భౌతిక కాయాన్ని ఆయన నివాసం వద్ద సాహితీ మిత్రులు, ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆయన మృతి వార్త తెలియగానే తిరునల్వేలి, పరిసర ప్రాంతాల్లో ఉన్న రచయితలు, కవులు పెద్ద సంఖ్యలో వచ్చి భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బ్రహ్మ తీర్థ ట్రస్ట్ కొత్త నిర్వాహకుల ఎంపిక



కొత్త నిర్వాహకులను సత్కరిస్తున్న ఉపాధ్యక్షుడు రాజా

వేలూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్తువాచేరిలో బ్రాహ్మణ సంఘ కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి సంఘ ఉపాధ్యక్షుడు రాజా అధ్యక్షత వహించగా, అత్తిమలైపట్టు గణేష్ శాస్త్రులు సమావేశం ప్రారంభించారు. ఈ సమావేశంలో బ్రహ్మతీర్థ ట్రస్ట్ కొత్త నిర్వాహకులను ఎంపిక చేశారు. కొత్త నిర్వాహకులుగా కృష్ణమూర్తి, శంకర్‌బాబు, అనంత నారాయణన్ రాజ, శరవణన్, సుబ్రమణ్యన్, శేఖర్, శ్రీనివాసన్‌లు ఎంపిక కాగా, ఉపాధ్యక్షుడు రాజ శాలువాలతో వారిని సత్కరించారు.

తూత్తుక్కుడి థర్మల్ కేంద్రంలో అగ్నిప్రమాదం

అడయార్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తూత్తుక్కుడి జిల్లాలోని థర్మల్ విద్యుత్ కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ కేంద్రంలో చెలరేగిన మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది 15 గంటలకుపైగా శ్రమించాల్సి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఈ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఐదు యూనిట్ల నుంచి 1050 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఇందులో శనివారం రాత్రి 9 గంటల సమయంలో శీతలీకరణ ప్లాంట్ సమీపంలోని కేబుల్ గ్యాలరీ అనే ప్రాంతంలో మంటలు చెలరేగడంతో శరవేగంగా వ్యాపించాయి. వీటిని ఆర్పేందుకు అగ్నిమాపకదళ సిబ్బంది దాదాపు 15 గంటలకుపైగా శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తూత్తుక్కుడి, నెల్లై, కన్నియాకుమారి జిల్లాలకు చెందిన 20కుపైగా ఫైరింజన్లు ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశాయి. ఈ ప్రమాదం కారణంగా 630 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది.

23వ తేదీకి గ్రామసభల వాయిదా

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో ఈ నెల 22న జరగాల్సిన గ్రామసభలు 23వ తేదీకి వాయిదాపడ్డాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో... జిల్లాలో 14 పంచాయతి యూనియన్ పరిధిలోని 526 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 22న అంతర్జాతీయ తాగునీటి దినోత్సవం సందర్భంగా గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కానీ, నిర్వహణ కారణాల రీత్యా జిల్లాలో 23వ తేది ఉదయం 10 గంటలకు గ్రామ సభలు నిర్వహించనున్నామని, 18 ఏళ్లకు పైబడిన వారు పంచాయతి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలకు లబ్దిదారుల ఎంపిక తదితరాలకు సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

డీకేఎం కళాశాల స్వర్ణోత్సవ స్నాతకోత్సవం



విద్యార్థులకు డిగ్రీలు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినాథపురంలో ఉన్న ధనభాగ్యమ్ కృష్ణస్వామి మొదలియార్ మహిళా కళాశాల 50వ స్నాతకోత్సవం కళాశాల ప్రాంగణంలో జరిగింది. వేడుకలను కళాశాల సెక్రటరీ మణినాథన్ ప్రారంభించగా, ముఖ్యఅతిథిగా డా.ఇరై అన్బు పాల్గొని, కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు డిగ్రీలు అందజేశారు. ఈ సందర్భంగా ఇరైఅన్బు మాట్లాడుతూ... మహిళ చదువుకుంటే ఆమె కుటుంబంతో పాటు సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవగ్రహ ఆలయాల పునరుద్ధరణకు రూ.30 కోట్లు

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, కారైక్కాల్ ప్రాంతాల్లోని 9 నవగ్రహ ఆలయాల్లో 'ప్రసాద్' పథకంలో మౌలిక సదుపాయాల కల్పన, పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం రూ.30 కోట్లు విడుదల చేసింది. ఈ విషయమై పర్యాటక శాఖ అధికారి మాట్లాడుతూ... రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రసాద్ పథకంలో రాష్ట్రంలోని 8 నవగ్రహ ఆలయాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేలా రూ.44.95 కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. కానీ, కేంద్ర పర్యాటక శాఖ, రాష్ట్రంలోని 8 ఆలయాలు, పుదుచ్చేరి రాష్ట్రం కారైక్కాల్‌లో ఉన్న ఒక ఆలయం మొత్తం 9 నవగ్రహ ఆలయాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.30 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఆ ప్రకారం, తంజావూరు, మైలాడుదురై, తిరువారూరు జిల్లాల్లోని సూర్యనార్ ఆలయం, తింగళూరు కైలాసనాథర్ ఆలయం, కంజనూరు అగస్త్రీశ్వర ఆలయం, తిరునాగేశ్వరం నాగనాథ స్వామి ఆలయం సహా 8 నవగ్రహ ఆలయాలు, పుదుచ్చేరి రాష్ట్రం కారైక్కుడిలోని తిరునల్లారు తర్పారణేశ్వర ఆలయాన్ని చేర్చిందని, త్వరలో ఈ ఆలయాల్లో పునరుద్ధరణ పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

నాలుగేళ్ల వేతనాలు చెల్లించాలంటూ ఉపాధ్యాయుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అసోసియేట్ ప్రొఫెసర్లు

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మదురైలో ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు, అసోసియేట్ ప్రొఫెసర్లు శనివారం ఆందోళన చేపట్టారు. ఆందోళనలో పాల్గొన్న మహిళలు సహా 400 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. యూజీసీ ఏడవ వేతన సంఘం సిఫారసుతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కోసం 2021లో జీవో విడుదల చేశారు. ఈ జీవో ప్రకారం ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయులకు వేతనం, బకాయిలు చెల్లించగా, ఎయిడెడ్ కళాశాలల ఉపాధ్యాయులు, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించి, వేతనాలు మాత్రం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో, నాలుగేళ్ల వేతనం అందించాలని కోరుతూ ఉపాధ్యాయులు, అసోసియేట్ ప్రొఫెసర్లు మదురైలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు.

నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా డీఎంకేతో కలిసి పోరాడుతా

● డీఎండీకే నాయకురాలు ప్రేమలత



మీడియాతో మాట్లాడుతున్న ప్రేమలత

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన పేరుతో రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య తగ్గించేందుకు ప్రయత్నిస్తే డీఎంకే ప్రభుత్వంతో కలిసి తమ పార్టీ పోరాడేందుకు సిద్ధంగా ఉందని డీఎండీకే నాయకురాలు ప్రేమలత స్పష్టం చేశారు. దిండుగల్ జిల్లా పళనిలో ఆదివారం మధ్యాహ్నం పార్టీ ప్రముఖుడి ఇంట జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌ను తమ పార్టీ స్వాగతిస్తుందని, ఎందుకంటే తమ పార్టీ వ్యవస్థాపకుడు విజయకాంత్ రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టోలోని పలు అంశాలు ఈ బడ్జెట్‌లో ఉండటమేనన్నారు. వాటిలో ముఖ్యంగా విదేశాల్లో పంటలను పండించే విధానాలను తెలుసుకునేందుకు రైతులను జపాన్ తదితర దేశాలకు విహర యాత్రగా తీసుకెళతానని కెప్టెన్ చేసిన హామీ బడ్జెట్‌లో ఉండటం విశేషమన్నారు. మహాభ్యుదయానికి సంబంధించి కూడా బడ్జెట్‌లో పలు ప్రతిపాదనలు, పథకాలుండడం హర్షణీయమన్నారు. మాతృభాషను కాపాడుకుందాం అన్ని భాషలను నేర్చుకుందాం అనే నినాదమే తమ పార్టీ తారకమంత్రమని ప్రేమలత అన్నారు.

విద్యుదాఘాతంతో ఎలుగుబంటి మృతి



పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభంపై ఉన్న తేనె పట్టులో తేనె తాగేందుకు ఎక్కిన ఎలుగుబంటి విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన నీలగిరి జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని కున్నూర్ ప్రాంతంలో కొంత కాలంలో ఎలుగుబంట్ల సంఖ్య అధికమైంది. ఆహారం, తాగునీటి కోసం సమీపంలోని తేయాకు తోటలు, జనావాస ప్రాంతాల్లోకి ఎలుగు బంట్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, నాన్‌సెట్ ప్రాంతంలోని వరదరాజన్ ఇంటి సమీపంలోని విద్యుత్ స్తంభంపై తేనెపట్టును గమనించిన ఎలుగుబంటి, స్తంభం ఎక్కి తేనె తాగేందుకు యత్నించింది. ఆ సమయంలో హఠాత్తుగా విద్యుత్ తీగకు తగడంలో విద్యుదాఘాతానికి గురై స్తంభం పై నుంచి కిందపడి మృతిచెందింది. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది చేరుకుని ఐదేళ్ల మగ ఎలుగుబంటిగా గుర్తించారు. ఎలుగు కళేబరానికి పశువైద్యులు పోస్టుమార్టం నిర్వహించగా, సమీపంలో అడవిలో ఖననం చేశారు.

వేడుకగా ఆనైకులత్తమ్మన్ రథోత్సవం



వేలూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేలప్పాడిలోని ఆనైకులత్తమ్మన్, పడవేట్టమ్మన్ ఆలయ మాసి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రథోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వేకువజామున ఆనైకులత్తమ్మన్‌కు ప్రత్యేక అభిషేకం, అలంకరణ, దీపారాధన నిర్వహించారు.అనంతరం ఉత్సవమూర్తుల ను అందంగా అలంకరించిన రథం లో ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు.రథంపై మిరియాలు, ఉప్ప చల్లుతూ భక్తులు అమ్మవారిని ఆహ్వానించారు.

28న టీవీకే సర్వసభ్య మండలి సమావేశం

● 2,500 మంది ప్రతినిధులకు ఆహ్వానం

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) సర్వసభ్య మండలి సమావేశం ఈనెల 28న తిరువాన్మియూర్‌లో జరగనుంది. ఈ సర్వసభ్య మండలిలో చేయాల్సిన తీర్మానాలపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అధ్యక్షుడు విజయ్‌తో చర్చించినట్లు సమాచారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు ఖండించడం, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు సహా పలు తీర్మానాలు ఆమోదించనున్నారు. అనంతరం సమావేశం ఆమోదించిన తీర్మానాలను ఎన్నికల సంఘానికి నివేదించనున్నట్లు సమాచారం. సమావేశంలో ఒక్కో జిల్లా నుంచి జిల్లా కార్యదర్శి, కోశాధికారి, సంయుక్త కార్యదర్శి, జనరల్ కమిటీ సభ్యులు కలిపి మొత్తం 15 మందికి ఆహ్వానాలు పంపించనున్నారు. కాగా, ఇప్పటికే పార్టీ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 114 జిల్లా కార్యదర్శులను పార్టీ అధ్యక్షుడు విజయ్ ఆరు విడతలుగా ప్రకటించారు. త్వరలో మిగిలిన జిల్లాలకు కార్యదర్శులు, నిర్వాహకులను ఎంపిక చేయనున్నారు. సర్వసభ్య మండలి సమావేశంలో ఎన్నికల్లో కూటమి ఏర్పాటు, పార్టీ తదుపరి చేపట్టాల్సిన కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై విజయ్ ప్రసంగించనున్నారు.



అన్నాడీఎంకే ప్రభుత్వ పాలనలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించేలా వేలూరు లాంగ్ బజార్ సహా పలు ప్రాంతాల్లో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ఆ పార్టీ సెక్రటరీ అప్పు, నిర్వాహకులు వరదరాజన్, మూర్తి, దాస్, జయశంకర్, చూలై ఆనంద్ తదితరులు



వేలూరు కార్పొరేషన్ 51వ వార్డు వళ్లువర్ వీధి సమీపంలోని శివరాజ్ నగర్‌లో ఉన్న శ్మశానవాటికకు వేస్తున్న తారు రోడ్డు నిర్మాణాలను ఆదివారం పరిశీలిస్తున్న కార్పొరేటర్ జయశంకర్, డీఎంకే నాయకులు శ్రీనివాసన్ తదితరులు



తమిళ చిత్రజ్యోతి

గొప్ప అదృష్టం దక్కింది

● జోగన్ శివనేష్

దివంగత సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఇసైజ్ఞాని ఇళయరాజా, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్.రెహ్మాన్ వంటి దిగ్గజ సినీ సంగీత కళాకారులతో సన్నిహితంగా మెలిగే అరుదైన గొప్ప అదృష్టం తనకు దక్కిందని యువ సంగీత దర్శకుడు జోగన్ శివనేష్ అన్నారు. తాజాగా ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో తన జీవిత విశేషాలతో తన సినీ సంగీత ప్రయాణాన్ని వివరించారు. 'చెన్నైలోని సంగీత కుటుంబంలో జన్మించాను. తొమ్మిదో యేట నుంచే కీబోర్డ్ ప్లే చేసేవాడిని. ఏఆర్.రెహ్మాన్ నిర్వహించే కేఎం కన్జర్వేటరీని అపుడు 'వాప్పా' కన్జర్వేటరీగా పిలిచేవారు. ఇది ఒక మ్యూజిక్ స్కూల్ ఇందులో సౌండ్ ఇంజనీరింగ్ చదువుకున్నాను. అదే సమయంలో పెద్ద పెద్ద సంగీత దర్శకుల బృందాల్లో కీబోర్డు వాయించే అవకాశాలు వచ్చేవి. దీంతో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సంగీత దర్శకులు ఇళయరాజా, ఏఆర్.రెహ్మాన్ వంటి వారితో కలిసి పనిచేయడం, వారితో సన్నిహితంగా మెలిగే అవకాశం దొరికింది. 2008లో ఇళయరాజా నిర్వహించిన రాజా ఒన్ మేన్ షోలో కీబోర్డు వాయించాను. 2012లో 'కొల్లైకారన్' అనే చిత్రానికి సంగీతం సమకూర్చాను. ఇప్పటి నుంచి ఇపుడు 'రాబర్' సినిమా వరకు పలు చిత్రాలకు సంగీత స్వరాలు సమకూర్చుతూ వచ్చాను. నేను సంగీతం దర్శకత్వం వహించిన పలు చిత్రాలు ప్రేక్షకాదరణ పొందాయి' అని జోగన్ శివనేష్ వెల్లడించారు.

21న శ్యామ్ 'అస్తిరం' విడుదల



'అస్తిరం'లో శ్యామ్

శ్యామ్ హీరోగా నటించిన 'అస్తిరం' (అస్త్రం) చిత్రం ఈ నెల 21వ తేదీ విడుదలకు సిద్ధమైంది. వాస్తవానికి ఈ చిత్రం మార్చి మొదటి వారం(మార్చి 7వ తేదీ)లోనే విడుదలకావాల్సి ఉంది. కానీ, అనుకున్న సంఖ్యలో థియేటర్లు కేటాయించకపోవడంతో విడుదల వాయిదా వేశారు. దీంతో తాజాగా కొత్త తేదీని మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. చిత్రీకరణ పనులతో పాటు ప్రెస్ స్క్రీనింగ్ కూడా పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమాను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఫైవ్‌స్టార్ నిర్మాణ సంస్థ విడుదల చేయనుంది.. షణ్ముఖమణి నిర్మించిన క్రైమ్ థ్రిల్లర్ చిత్రానికి అరవింద్ రాజగోపాల్ దర్శకత్వం వహించారు. ఇందులో శ్యామ్ సరసన మోడల్ నీరా హీరోయిన్‌గా నటించగా, నిళల్‌గల్ రవి, జీవా రవి తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు.

చైన్ స్నాచింగ్ నేపథ్యంలో 'రాబర్'

మన నిత్యం వార్తాపత్రికల్లో చదివే దోపిడీలు, దొంగతనాలు, చైన్ స్నాచింగ్ అనే అంశాలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని రూపొందించిన చిత్రం 'రాబర్'. దోపిడీల్లో దోచుకునే విలువైన ఆభరణాలను ఏం చేస్తారు? వారి నెట్‌వర్క్ ఎలా పనిచేస్తుంది? ఆ ఆభరణాలతో వారు ఏం చేస్తారు? అంటి ఆసక్తికర అంశాలతో నూతన దర్శకుడు ఎస్ఎం పాండి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మెట్రో సత్య హీరోగా నటించారు. అలాగే, దోపిడీ ముఠా చేతిలో తన కుమార్తెను పోగొట్టుకున్న బాధలో ప్రతీకారం తీర్చుకోవాలన్న తపనతో పోరాడే పాత్రలో జయప్రకాష్, ఆయనకు సహకరించే పాత్రలో పాండియన్ నటించారు. ఆధునిక ప్రతినాయకుడి పాత్రను డానీ పోషించారు. ఈ కథను దర్శకుడు వివరిస్తూ, 'పల్లెటూరుకు చెందిన హీరో ఉపాధి కోసం పట్టణానికి రాగా, చెన్నైలో ఒక చిన్న ఉద్యోగాన్ని సంపాదించుకుని వచ్చిన జీతంలో తాను పొట్టపోసుకుంటూ కొంత గ్రామంలో ఉండే తన తల్లికి పంపుతుంటాడు. అయితే సిటీ లైఫ్‌కు అలవాటుపడి లగ్జరీ జీవితాన్ని అనుభవించాలని కోరుకునే హీరో... తనకు వచ్చే జీతం డబ్బు చాలకపోవడంతో నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్ళే మహిళలను అడ్డగించి చైన్ స్నాచింగ్ చేయడం ప్రారంభిస్తాడు. ఈ దొంగ జీవితం చివరకు ఎక్కడకు తీసుకెళ్ళి నిలబెడుతుందన్నదే ఈ చిత్ర కథ. మీడియా కూడా చిత్ర విజయంలో అండగా నిలిచింది' అని పేర్కొన్నారు.



'రాబర్'లో ఓ దృశ్యం

దర్శకత్వం వైపు మంజిమా?



మంజిమా మోహన్

నటి మంజిమా మోహన్ దర్శకత్వం వైపు మొగ్గు చూపుతున్నారు. గత కొంతకాలంగా సినిమా అవకాశాలు లేకపోవడంతో ఆమె దర్శకత్వం వహించాలని ఉవ్విళ్ళూరుతున్నారు. గతంలో పలు తమిళ చిత్రాల్లో నటించిన మంజిమా... కోలీవుడ్ యువ హీరో, సీనియర్ నటుడు కార్తీక్ కుమారుడు గౌతం కార్తీక్‌ను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత ఆమె నటనకు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా 'సుళల్-2' అనే పేరుతో రూపొందిన వెబ్‌సిరీస్‌లో నటించారు. ఇందులో ఆమె పాత్రకు మంచి పేరుతో పాటు ప్రశంసలు దక్కాయి. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'నేను స్క్రీన్‌ప్లే రాయలేను. కానీ దర్శకత్వం వహించాలని ఆశపడుతున్నాను. కథా రచయిత సిద్ధం చేసే స్క్రిప్టును తెరపై అద్భుతంగా ప్రజెంట్ చేయగలను. థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కించాలన్నదే నా కల. వచ్చే ఐదారేళ్ళలో దర్శకత్వం వహిస్తాననే నమ్మకం నాలో ఉంది' అని పేర్కొన్నారు.



డాక్టర్ రాజీవ్‌మేనన్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఆర్ఎస్ మునిరత్నం తదితరులు

విద్యార్థులకు బహుముఖ పరిజ్ఞానం అవసరం!

● ఎల్టీఐ మైండ్‌ట్రీ గ్లోబల్ హెడ్ డాక్టర్ రాజీవ్‌మేనన్

● ఘనంగా ఆర్ఎంకే కాలేజీ స్నాతకోత్సవం



పట్టాలు అందుకున్న విద్యార్థులతో ఆర్ఎస్ మునిరత్నం, ఆర్ఎం.కిషోర్, ప్రదీప్ తదితరులు

ప్యారీస్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం అత్యంతవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, విద్యార్థులు రాణించాలంటే బహుముఖ పరిజ్ఞానం ఉంటేనే విజయం సాధిస్తారని ఎల్టీఐ మైండ్‌ట్రీ గ్లోబల్ హెడ్ రాజీవ్‌మేనన్ పేర్కొన్నారు. తిరువళ్లూరు జిల్లా కవరైపేటలోని ఆర్ఎంకే ఇంజనీరింగ్ కళాశాల 25,26వ వార్షిక స్నాతకోత్సవాలు ఆదివారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. 2023-24వ బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలతో పాటు ఉత్తమ విద్యార్థులకు క్యాష్ అవార్డులు అందజేశారు. ఆర్ఎంకే విద్యాసంస్థల వ్యవస్థాపకులు, చైర్మెన్, మాజీ ఎమ్మెల్యే విద్యారత్న ఆర్ఎస్ మునిరత్నం స్నాతకోత్సవ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివంగత మాజీముఖ్యమంత్రి ఎంజీఆర్ ఆశయాలకు అనుగుణంగా తాను కొన్నాళ్ళు ఎమ్మెల్యేగా గెలుపొంది, ప్రజావృద్ధికై కృషిచేశానని, అదేవిధంగా 31ఏళ్ళ క్రితం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే సంకల్పంతో లక్ష్మీకాంతమ్మాళ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రారంభించి, తద్వారా ఆర్ఎంకే, ఆర్ఎండీ ఇంజనీరింగ్ కళాశాలలో పాటు ఆర్ఎండీ సీనియర్ సెకండరీ పాఠశాలను ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. తమ సంస్థల్లో 1200 మంది ప్రొఫెసర్లు, 3,900మందికి పైగా పలు విభాగాల ఉద్యోగుల సహకారంతో ఈ విద్యాసంస్థలను అభివృద్ధి బాటలో నడుపుతున్నట్లు తెలిపారు. దేశంలోని సమారు 5వేల ఇంజనీరింగ్ కళాశాలల్లో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతల్లో తమ సంస్థ 7,8 స్థానాల్లో నిలబడటం గర్వకారణమన్నారు. అదేవిధంగా గత ఏడాది తాను అమెరికాకు వెళ్లినప్పుడు న్యూయార్క్, వాషింగ్టన్ ప్రాంతాల్లో తమ సంస్థల్లో చదువుకున్న 50మంది పూర్వవిద్యార్థులు పలు కంపెనీల్లో సీఈవోలుగా పనిచేస్తున్నట్లు తెలిసి ఎంతో సంతోషపడ్డానన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజీవ్‌మేనన్ 1200మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్ఎంకే విద్యాసంస్థల చైర్మెన్ ఆర్ఎస్ మునిరత్నం, వైస్ చైర్మెన్ ఆర్ఎం.కిషోర్ విద్యార్థులను, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తమ కుటుంబ సభ్యుల్లాగా చూసుకోవడంవల్లే ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. విద్యార్థులందరూ ప్రతిభావంతులుగా ఎదిగి తల్లిదండ్రులకు, సమాజానికి, చదువుకున్న విద్యాసంస్థకు సేవలందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంకే విద్యాసంస్థల వైస్ చైర్మెన్ ఆర్ఎం.కిషోర్, కార్యదర్శి యలమంచి ప్రదీప్, డైరెక్టర్ ఆర్.జ్యోతినాయుడు, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ దుర్గాదేవి ప్రదీప్, మేనేజింగ్ ట్రస్టీ సౌమ్య కిషోర్, అడ్వైజర్లు ఎంఎస్ పళనిస్వామి, వి.మనోహరన్, ప్రిన్సిపల్ డాక్టర్ కేఏ.మహ్మద్ జునైద్, డాక్టర్ చంద్రమౌళి, మాజీ ఐఏఎస్ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోలాహలంగా జల్లికట్టు



వడివాసన్ నుంచి దూసుకొస్తున్న ఎద్దు



ఎద్దును అదుపుచేస్తున్న యువకుడు

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా విరాలిమలై సమీపం పెరియకరుప్పంబట్టి అయ్యనార్ ఆలయ వేడుకల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన జల్లికట్టు కోలాహలంగా సాగింది. ఉదయం 9 గంటలకు ఆర్డీవో అక్బర్ అలి, విరాలిమలై ఎమ్మెల్యే, మాజీ మంత్రి సి.విజయభాస్కర్, డీఎంకే సర్వసభ్య మండలి సభ్యుడు తెన్నలూరు పళనియప్పన్ పోటీలు ప్రారంభించారు. తొలుత వడివాసన్ నుంచి ఆలయ ఎద్దును విడిచిపెట్టారు. అనంతరం, తిరుచ్చి, పుదుకోట, మదుర, కరూర్, దిండుగల్, తేని సహా పలు జిల్లాల నుంచి వచ్చిన సుమారు 750 ఎద్దులు పాల్గొనగా, వాటిని అదుపుచేసేందుకు 300 మంది యువకులు బరిలో దిగారు. వడివాసన్ నుంచి రంకెలేస్తూ వస్తున్న ఎద్దును అదుపుచేసేందుకు యువకులు ప్రయత్నించగా, వారి నుంచి తప్పించుకుని ఎద్దులు పరుగులు తీశాయి. ఎద్దులను అదుపు చేసే క్రమంలో సుమారు 40 మందికి పైగా గాయపడ్డారు. ఆరోగ్య శాఖ సిబ్బంది వడివాసల్ పక్కనే వైద్య శిబిరం ఏర్పాటుచేసి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన వారిని అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన యువకులు, ఎద్దుల యజమానులకు బీరువా, మంచం, బంగారు, వెండి నాణేలు సహా పలురకాల బహుమతులు అందజేశారు. ఈ పోటీ తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలు, జిల్లాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పోటీల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏడుగురు ఇన్స్‌పెక్టర్ల నేతృత్వంలో 150 మంది పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.





ర్యాలీ ప్రారంభిస్తున్న మాజీ డీజీపీ శైలేంద్రబాబు - ర్యాలీలో ప్ల కార్డులతో విద్యార్థులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● మాజీ డీజీపీ శైలేంద్రబాబు

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మాజీ డీజీపీ శైలేంద్రబాబు ప్రజలకు సూచించారు. గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ పరిధిలోని కేంద్ర నేరవిభాగం, శ్రీరామచంద్ర ఉన్నత విద్య, పరిశోధన సంస్థ సంయుక్తంగా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీ చేపట్టారు. బీసెంట్ నగర్‌లోని ఎలియట్స్ బీచ్ సమీపంలో ఆదివారం ఉదయం మాజీ డీజీపీ శైలేంద్రబాబు ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయన్నారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌ల పేరుతో పలువురు ప్రజలను నమ్మించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, బ్యాంక్ అధికారులమంటూ బ్యాంక్ అకౌంట్ నెంబరు తెలుసుకొని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్ మెసేజ్ రూపంలో వచ్చే లింక్‌లు క్లిక్ చేయరాదని సూచించారు. అనుమానాస్పద కాల్స్, ఆన్‌లైన్‌లో నగదు కోల్పోవడం తదితరాలకు www.cybercrime.gov.in అనే వెబ్ సైట్, 1930 అనే సైబర్ క్రైం సహాయ కేంద్రానికి సత్వరం ఫిర్యాదు చేయాలని మాజీ డీజీపీ సూచించారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించేలా స్లోగన్ రాసిన 10 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ర్యాలీలో కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



తిరుచెందూరు ఆలయ ప్రాంగణం వద్ద భక్తులు

మాసి ఉత్సవాలు ముగిసినా
తిరుచెందూరులో తగ్గని రద్దీ

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరుదివ్యక్షేత్రాల్లో రెండవది, సుప్రసిద్ధ పరిహార స్థలంగా కీర్తిగడించిన తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇటీవల ఆ ఆలయంలో మాసి ఉత్సవాలు ముగిశాయి. అయినా ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఏ మాత్రం తగ్గలేదు. ఆదివారం రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వీటికి తోడు ఆదివారం శుభముహూర్త దినం కావడంతో ఆలయ ప్రాంగణంలో ఒకే సారి ఇరవైకి పైగా వివాహాలు జరిగాయి. దీంతో ఆలయం ఎదురుగా ఉన్న మండపాలన్నీ పెళ్ళి జనంతో భక్తులతో నిండిపోయాయి. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కూడా కురిశాయి. స్వామివారి దర్శనం కోసం ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లలో వందల సంఖ్యలో భక్తులు బారులు తీరారు. సముద్రతీర ప్రాంతం, నాళికినరు ప్రాంతం వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. ఆలయనిర్వాహకులు ఆదివారం ఉదయం 11 నుండి సాయంత్రం ఐదు గంటల దాకా భక్తులకు నిర్విరామంగా అన్నదానం చేశారు.



స్నాతకోత్సవంలో పట్టా అందుకున్న విద్యార్థినులతో నిర్వాహకులు

ఘనంగా హిందూ కళాశాల
48వ స్నాతకోత్సవం

అడయార్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరాంలోని ధర్మమూర్తి బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కాలేజీ 48వ స్నాతకోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వి శ్రాంతి ఐఏఎస్ టీఎస్ శ్రీధర్ మాట్లాడుతూ, ' ప్రతిఫలాపేక్ష లేకుండా నిరంతర దాన ధర్మాలు చేస్తున్న హిందూ కాలేజీ వ్యవస్థాపకులు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు వెళ్ళాలని సూచించారు. ప్రస్తుత ప్రపంచంలో యువత ఉపాధికి అనేక అవకాశాలున్నాయని, వాటిని అందిపుచ్చుకుని రాణించాలన్నారు. అంతకుముందు కాలేజీ కార్యదర్శి వెంకటేశ పెరుమాళ్ అధ్యక్షతన స్నాతకోత్సవం ప్రారంభించి, అతిథులకు స్వాగతం పలికారు. తర్వాత ప్రధాన అధ్యాపకులు డాక్టర్ కల్విక్కరసి ముఖ్య అతిథిని పరిచయం చేసి 398 విద్యార్థులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా డిగ్రీలు అందజేశారు. వీరిలో మద్రాస్ విశ్వవిద్యాలయం స్థాయిలో మొదటి, రెండు ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు కళాశాల తరపున నగదు బహుమతులను ప్రకటించారు. బీఏ తెలుగులో ఓపీ సంధ్య అనే విద్యార్థి బంగారు పతకం సాధించింది. డిగ్రీలు పుచ్చుకున్న అనంతరం విద్యార్థులతో ప్రిన్సిపాల్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ స్నాతకోత్సవంలో కళాశాల ట్రస్టీలు ఎం.వి.కన్నయ్య చెట్టి, బి.గౌతమ్, సంచాలకుడు డాక్టర్ జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది.

వైభవంగా కంచి పచ్చయమ్మన్ ఆలయ కుంభాభిషేకం



ఆలయ గోపుర కలశాలపై పవిత్ర జలాలను సంప్రోక్షిస్తున్న వేద పండితులు

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం సమీపం తేనంబాక్కంలోని శ్రీమన్నాథర్ స్వామి సమేత పచ్చయమ్మన్ ఆలయ మహాకుంభాభిషేక వేడుకలు ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగాయి. గంబీర శబ్ద మునీశ్వరుడి రూప శిల్పాన్ని పవిత్ర జలాలలో అభిషేకించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని పరివార దేవతలకుగాను 20 యాగశాలలు, మూలవిరాట్టు పచ్చయమ్మన్‌కోసం 21 యాగశాలలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, ఆదివారం ఉదయం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ, శివ వాయిద్యాలు మోగిస్తుండగా పవిత్రనదీజలాల కలశాలను అర్చకులు, పండితులు మోసుకెళ్ళి రాజగోపురం, గర్భాలయ గోపురం, సప్త మునీశ్వరుల సన్నిధి పై కలశాలపై ఆ జలాలతో సంప్రోక్షణ చేశారు. ఈ సందర్భంగా మూలవిరాట్టు పచ్చయమ్మన్‌కు ప్రత్యేక మహాఅభిషేకం, దీపారాధన జరిపారు. వేడుకలలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయనిర్వాహకులు అన్నదానం చేశారు.



పచ్చయమ్మన్, మన్నాథర్ రూపాలను ఊరేగిస్తున్న భక్తులు

నామక్కల్ ఆంజనేయస్వామికి విశేష అభిషేకం



ఆంజనేయ స్వామి విగ్రహానికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం

పెరంబూర్,మార్చి16 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ ఆంజనేయస్వామి ఆలయంలో ఫంగుణి మాసం మొదటి ఆదివారం సందర్భంగా 1008 లీటర్ల పాలతో స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. నామక్కల్ కార్పొరేషన్ ఎగువ ప్రాంతంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో 18 అడుగుల ఏకశిలా విగ్రహమం ఉంది. ఫంగుణి మాసం మొదటి ఆదివారం సందర్భంగా తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచి,నెయ్యి, పంచామృతం, 1008 లీటర్ల పాలు,పెరుగు, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో ఆంజనేయ స్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, మహా దీపారాధన నిర్వహించారు. ఈ వేడుకల్లో నామక్కల్, సేలం, ఈరోడ్ సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని, క్యూలైన్ల వేచి స్వామి దర్శనం చేసుకున్నారు.

కోరాకుప్పం కేవీ పాఠశాల ఆధ్వర్యంలో మారథాన్



విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న పాఠశాల చైర్మన్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

తిరుత్తణి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట పరిధిలోని కోరాకుప్పంలోని కేవీ పాఠశాల ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సుమారు 300మంది యువకులతో మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆ పాఠశాల చైర్మెన్ ప్రవీణ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. 6 కి.మీ వరకు జరిగిన ఈ మారథాన్‌లో మొదటి బహుమతికింద రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.5వేలు, మూడో విజేతకు రూ.3వేలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గోమతి, జమునా స్పోర్ట్స్ అధినేత భరత్‌కుమార్, లయన్ క్లబ్ అధ్యక్షుడు రామచంద్రన్, సొనాకుప్పం తులసీనాయుడు, స్పోర్ట్స్ అకాడమీ దీపక్, ఆర్కేపేట అసిస్టెంట్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ ఎరోమియాస్ ఆంటోనిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మారథాన్‌లో పాల్గొన్న యువకులు